క్లుప్తంగా

డీఎస్పీ ప్రత్యేక పూజలు



డీఎస్పీ, సీఐలను సన్మానిస్తున్న అర్చకులు

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని బడంపేట శ్రీరాచన్నస్వామి ఆలయంలో గురువారం జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మిత్రులతో కలిసి స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు డీఎస్పీతో పాటు జహీరాబాద్ టౌన్ సీఐ, శివలింగంను సన్మానించారు.

నీటి శుద్ధి యంత్రం అందజేత



యంత్రాన్ని ఇస్తున్న పూర్వ విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని మారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదొవ తరగతి 1995–96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాలకు నీటిశుద్ధి యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము చదివిన పాఠశాలకు సేవ చేయాలన్న లక్ష్యంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు నీటి శుద్ధి యంత్రాన్ని బహూకరించినట్లు తెలిపారు. మిగతా విద్యార్థులు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకొని పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావాలని ఉపాధ్యాయులు సూచించారు.

‘ఆలు’ పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాహుల్

జహీరాబాద్ టౌన్: మండలంలోని హుగ్గెల్లి, రాయిపల్లి(డి) గ్రామాల పరిధిలో రైతులు పండిస్తున్న ‘ఆలు’ పంటను గురువారం ఏరువాక కేంద్రం సంగుపేట శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ పరిశీలించారు. ఆలు పంటకు ఆశిస్తున్న తెగులను గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలుగడ్డ పంటలో మట్టి ఎగదోసే పద్ధతి(ఎర్తింగ్ అప్) వల్ల దుంపను సూర్యరశ్మి నుంచి రక్షిస్తుంది. గాలి, నీటి ప్రసరణ సక్రమంగా అంది దుంప బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. దుంత తొలుచు పురుగు వల్ల పంటకు ఎక్కువ నష్టం కలుగుతోందని చెప్పారు. రైతులు పండిస్తున్న ఆలు పంటకు పచ్చదోమ, తెల్లదోమ ఆశించిందని, నివారణకు ఫ్లోనికామిడ్స్ 0.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట ఉద్యోగులు శ్రీకాంత్, రైతులు ఉన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



నిర్మాణ పనులకు పూజలు చేస్తున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని గోవింద్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు ప్రహరీ గురించి గ్రామస్తుల వద్ద ప్రస్తావన తీసుకొచ్చారు. ప్రహరీ నిర్మిస్తే పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామ పంచాయతీలో నిధులు ఉండడంతో గోడ కట్టాలని తీర్మానం చేసుకున్నారు. ఇదే విషయం అధికారులకు చెప్పి ప్రతిపాదనలు తయారు చేయించి రూ.6 లక్షల నిధులు మంజూరు చేయించారు. ప్రహరీ నిర్మాణానికి ముగ్గు వేయించి విద్యార్థులతో పూజలు చేయించి, పనులు ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో మహాపడి పూజ



పూజలు చేస్తున్న వీరేందర్‌రెడ్డి దంపతులు

మునిపల్లి(అందోల్): భక్తిశ్రద్ధలతో మాజీ సర్పంచ్ వీరేందర్‌రెడ్డి దంపతులు అయప్ప స్వామి మహాపడిపూజను నిర్వహించారు. గురువారం మండలంలోని మల్లికార్జునపల్లి గ్రామంలో మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో చేశారు. అయప్పస్వాముల భజనలు, పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం చేశారు.

వరిసాగులో మెలకువలు తప్పనిసరి

- మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రైతులకు పలు సూచనలు



వరి నారుమడి



శ్రీనివాస్

హత్నూర(సంగారెడ్డి): ప్రస్తుతం రబీ సాగు కోసం రైతులు వరినారు పెంపకం చేపట్టారు. నారు పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హత్నూర మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ రైతులకు పలు సూచనలు తెలియజేశారు. రైతులు మొదటగా నారు పెంపకం కోసం నారుమడిని బాగా దున్ని మూడుసార్లు దమ్ము చేసి చదును చేసుకోవాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు మడిలో ఏర్పాటు చేసుకోవాలి. రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. వీటితో పాటు పశువుల పేడ వేయాలి. మొలక కట్టిన విత్తనాన్ని దుక్కిలో చల్లాలి. మొదట పలుచగా నీరు ఉంచాలి. జింకు లోపం సవరణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి. వరి నారు వేయడానికి సిద్ధంగా వచ్చిన సమయానికి వారం ముందు గుంట నారుమడికి 400గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఇసుకలో కలిపి చల్లాలి. 15 రోజుల ముందు దమ్ము చేయాలి.. జీవన ఎరువులు అనగా అజోలా 150 కిలోలు, 50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ పొలంలో వేసి మూడు వారాల పాటు పెరగనిచ్చి నేలలో వేసి కలియ దున్నాలి. ఇలా చేసినట్లయితే ఎకరాకు మూడు టన్నుల పచ్చిరొట్ట. 12 కిలోల నత్రజనిని అందిస్తుంది. నారు నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు ఒకటి చొప్పున కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి. ఈ విధంగా రైతులు సూచనలు పాటిస్తే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి వివరించారు. సాగులో సమస్యలు తలెత్తితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఏఎన్‌ఎంల పరీక్షను రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

సంగారెడ్డి : వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలు, ఈసీ ఎఎన్‌ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్‌ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్‌ఎంలకు రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక డీఎంహెచ్ఓ సూపరింటెండెంట్ శ్రీవాణికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రెండుసార్లు యూనియన్లతో చర్చలు జరిపినప్పటికీ మొండి వైఖరిని వీడడం లేదన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎం అందరిని డైరెక్ట్‌గా రెగ్యులర్ చేయడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. కానీ, ప్రభుత్వం మొండిగా రాత పరీక్ష ద్వారానే రిక్రూట్మెంట్ చేస్తామంటుదని మండిపడ్డారు. ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌లో 1520 పోస్టులు ప్రకటించి యూనియన్లతో చర్చల అనంతరం 400 పైచిలుకు పోస్టులు పెంచిందన్నారు. గతంలో లేని పోస్టులు చర్చల అనంతరం ఎలా పెరిగాయని నిలదీశారు. రాత పరీక్ష అంటే కొత్తగా వచ్చిన విద్యార్థులతో వీరి పోటీ పడడమే, దీనివల్ల పాతవారికి నష్టం జరుగుతుందన్నారు. రెగ్యులర్ చేయని పక్షంలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు మాధవి, సంపూర్ణ, దీపిక విజయ, కళ్యాణి, శ్రావణి పద్మ, తదితరులు పాల్గొన్నారు.



కంది(సంగారెడ్డి): ఓడీఎఫ్‌లో..



హత్నూర(సంగారెడ్డి): దౌల్తాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం..

హోరెత్తిన నిరసనలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. కాంగ్రెస్, దళిత, బీసీ సంఘాల నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేసి ఆందోళనలు తెలిపారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. అంబేడ్కర్ అణగారిన వర్గాల ఆశాజ్యోతిని .. ఆయన ను అనుమానించడం సబబు కాదన్నారు. వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



సదాశివపేట: అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

చెక్కు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదల వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధురెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని భారతీనగర్ డివిజన్ చెందిన రాజేష్ రెడ్డికి సీఎం సహాయనిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో అందించడం జరిగిందన్నారు.

అంగన్‌వాడీలకు పెంచిన జీతం ఇవ్వాలి

నారాయణఖేడ్: మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రధాన అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచినట్లు తెలిపి.. కేవలం రెండు నెలలు మాత్రమే పెంచిన వేతనాలు చెల్లించి ప్రస్తుతం చెల్లించడం లేదని వాపోయారు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ఇస్తున్నట్లుగా మినీ అంగన్‌వాడీలకు కూడా ఇవ్వాలన్నారు. లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌లోని అశోక్‌నగర్, జ్యోతినగర్ పరిధిలో జరుగుతున్న ఓపెన్‌డ్రైన్ పనులను గురువారం కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓపెన్ డ్రైన్ వేసిన ప్రాంతంలో సీసీ రోడ్డును అభివృద్ధి చేస్తామన్నారు. కాలనీల్లో భవిష్యత్‌లో వర్షపునీరు ఆగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఆస్పత్రిలో అన్నదానం

సంగారెడ్డి : లంబాడీల ఐక్య వేదిక సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయక్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గురువారం అన్నదానం నిర్వహించారు. హోటళ్ల నుంచి పార్శిల్స్ తెచ్చి ఆస్పత్రిలో ఉన్న వారికి పంచి పెట్టారు. కార్యక్రమంలో రాథోడ్, నారాయణ, పర్లాల్ నాయక్ ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం..బుధవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురిని ఆదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా, మరోవ్యక్తికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అవగాహన లోపంతోనే ఆరోపణలు



విలేకరులతో మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): తమపై చేస్తున్న కాంగ్రెస్ నాయకుల ఆరోపణలను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు తమపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకొని మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 3న మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాను ప్రారంభించారని తెలిపారు. అధికార పార్టీలో ఉండి ప్రభుత్వం ప్రారంభించిన పనులపై కనీస అవగాహన లేకపోవడం కాంగ్రెస్ నాయకుల దురదృష్టకమని విమర్శించారు. నెల రోజుల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షాన బీఆర్ఎస్ పార్టీ తరపున నియోజకవర్గం వ్యాప్తంగా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వేణుపాల్‌రెడ్డి, సాయికిరణ్ రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, సతీష్, బీరప్ప, నాయకులు జైపాల్ రెడ్డి, రత్నం, లక్ష్మీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని పొట్టిపల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, మంగళహారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బర్దిపూర్ దత్తగిరి మహారాజ్, ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వర స్వామి, కార్మిక సంఘం జిల్లా నాయకుడు హుగ్గేలి రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ కేసులు కొట్టేసే వరకు పోరాడుతాం



సంగారెడ్డి టౌన్ : లగచర్లలో నవంబర్ 13న కలెక్టర్, పలువురు అధికారులపై జరిగిన దాడి కేసులో రైతులను అరెస్టు చేసి కంది సెంట్రల్ జైలుకు తరలించారు. 36 రోజుల తర్వాత నాంపల్లి స్పెషల్ కోర్టు వారికి బెయిల్ ఇచ్చింది. గురువారం వారి తరఫున న్యాయవాదులు రామచంద్రరావు, శుభప్రద్ పాటిల్ కందిలోని సెంట్రల్ జైలుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులపై నమోదైన కేసులు కొట్టేసేందుకు కోర్టులో పోరాడుతామన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పాటు మరో నలుగురు రైతులు చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారని చెప్పారు. రైతులకు కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కోర్టుకు సమర్పించాల్సిన ష్యూరిటీ సంతకాలు, డిపాజిట్ అమౌంట్ కూడా బీఆర్ఎస్ పార్టీయే భరిస్తుందని తెలిపారు.

◆ గొల్ల కురుమలకు అన్యాయం

జహీరాబాద్ టౌన్: గొల్ల కురుమలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని కురుమ సంఘం నాయకులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ ఆరోపించారు. ఇందిరా పార్కు ధర్నా చౌక్‌కు వెళ్తున్న పలువురు గొల్ల కురుమలను గురువారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు లక్షల నగదు బదిలీ, రెండవ విడత గొర్రెలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన గొర్రెలు ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. కట్టిన డీడీ డబ్బులను కూడా వెనక్కి ఇస్తుందని వాపోయారు.

◆ పాత కమిటీనే కొనసాగుతోంది..

నారాయణఖేడ్: పట్టణంలోని హాష్మి బైతుల్ మాల్ పాత కమిటీనే కొనసాగుతుందని గురువారం మైనార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల కాలానికి 2022 ఏప్రిల్ 15న బైతుల్ మాల్ కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ కమిటీ పదవీకాలం 2027 వరకు కొనసాగుతుందన్నారు. అయినప్పటికీ కొందరు కొత్త కమిటీ ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారని, కొత్త కమిటీ చెల్లదని ప్రస్తుతం ముజమ్మిల్ అధ్యక్షతన కొనసాగుతున్న కమిటీనే చెల్లుతుందని స్పష్టం చేశారు.

◆ పాఠశాలల తనిఖీ

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ భీంసింగ్ గురువారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. పలు పాఠ్యాంశాలను విద్యార్థులతో చదివించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ 21న హాకీ సెలక్షన్స్

సంగారెడ్డి జోన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27 నుంచి జరిగే సీఎం క్రీడాపోటీల్లో భాగంగా హాకీ క్రీడలో పాల్గొనేందుకు ఈ నెల 21న సెలక్షన్స్ జరగనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీం బేగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్స్ బీహెచ్‌ఈఎల్‌లో ఉ.7 గంటల నుంచి 10 గంటల వరకు జరుగుతాయన్నారు. వయస్సు 16 సంవత్సరాలు దాటిన వారు ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. సీఎం కప్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారు మాత్రమే ఈ సెలక్షన్‌లో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు 961877999, 9963435354లను సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళికలు

- సీఐ సుమన్‌కుమార్



సంగారెడ్డి క్రైమ్: పట్టణ వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణం కోసం పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పట్టణ ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ పేర్కొన్నారు. సంగారెడ్డి ట్రాఫిక్‌స్టేషన్ పరిధిలో కూడళ్లు, రోడ్ల విస్తరణ తదితర చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ పరిస్థితులను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఆఫీసర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో అనాధికారిక పార్కింగ్ ప్రాంతాలను గుర్తించడంతో పాటు, ట్రాఫిక్ రద్దీని విశ్లేషించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో రోడ్ల ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా, ప్రమాదాలు పునరావృత్తం కాకుండా వివిధ ప్రభుత్వ విభాగాలతో కలిసి నిర్మాణ పనులను చేపడతామన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో, కొత్త బస్టాండ్ వద్ద, కలెక్టరేట్ ఆవరణలో ప్రమాద పోకడలను విశ్లేషించి నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పట్టణంలో నంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలను గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీస్ విభాగం ప్రతిరోజు పోతిరెడ్డి పల్లి , పాత బస్టాండ్ వద్ద స్పెషల్ డ్రైవ్‌లతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు జెంక్షలను కీలకమైన ప్రాంతాలలో సిగ్నల్స్ అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చలానాలను క్లియర్ చేస్తున్నట్లు వివరించారు.

చిట్కుల్‌లో బిహార్ బృందం పర్యటన



ఎరువుల తయారీని వివరిస్తున్న అధికారి

పటాన్‌చెరు టౌన్: చిట్కుల్ గ్రామంలో బిహార్ నుంచి వచ్చిన జెడ్పీటీసీలు, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారుల, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల బృందం గురువారం పర్యటించింది. ఎన్ఐఆర్డీ శిక్షణ కేంద్రం అధికారి అరుణ్, పటాన్‌చెరు మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్ వారికి చిట్కుల్ గ్రామం అభివృద్ధిని చూపించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు, డంపింగ్ యార్డులు , చెత్త సేకరణ పద్ధతులు, వైకుంఠధామాలు, నర్స రీలను పరిశీలించింది. అలాగే, తడి ,పొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీని చూపించారు. ప్రతి విభాగంలో జరుగుతున్న అభివృద్ధిని తెలియజేశారు. గ్రామస్తులతో బిహార్ బృందం మాట్లాడి రికార్డు చేసింది. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, గ్రామ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగాల భర్తీ చేపట్టండి



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో కొత్త ఉద్యోగాల భర్తీ చేపట్టాలని సీఐటీయూ ఆధ్వర్యంలో భెల్ పరిశ్రమ గేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భెల్ సీఐటీయూ అధ్యక్షుడు పెంటయ్య మాట్లాడుతూ.. పరిశ్రమలో కొత్తగా ఉద్యోగ భర్తీలు చేయకపోవడంతో రోజురోజుకు పరిశ్రమలో కార్మికుల సంఖ్య తగ్గుతుందన్నారు. మోదీ ప్రభుత్వం భెల్ పరిశ్రమను ప్రైవేటీకరణ చేసేందుకు కొత్తగా ఉద్యోగ భర్తీలు చేయడం లేదని ఆరోపించారు. పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే పర్మినెంట్ కార్మికులు ఉండాలని తెలిపారు. యాజమాన్యం వెంటనే ఆర్టిజన్ రిక్రూట్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నాగులు, భాషా, కుమారస్వామి, సతీష్, లింగరాజు,ప్రభాకార్, నాగన్న, విరన్నలు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

- ఆర్సీఓ గౌతమ్ కుమార్‌రెడ్డి



సమావేశంలో గౌతమ్‌కుమార్‌రెడ్డి, టీచర్లు

నారాయణఖేడ్: మెరుగైన ఫలితాల సాధనకు ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ గౌతమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలం పరిధి జూకల్ శివారులోని పెద్దశంకరంపేట మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకులం, బాచేపల్లిలోని బాలికల గురుకులాలను ఆర్సీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతులు, విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఖేడ్‌లోని గురుకులానికి సొంత భవనం లేదని, మెరుగైన వసతులు కల్పించేలా పరిశీలిస్తున్నామని ఆర్సీఓ వివరించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్యాంపిల్స్ సేకరణ, రిపోర్టులు సక్రమంగా జరగాలి

- టీ హబ్, క్రిటికల్ కేర్ పనుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

సంగారెడ్డి: శాంపిల్స్ సేకరణ, ఫలితాలు ఎప్పటికప్పుడు సజావుగా జరగాలని ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ప్రతినిధులు డాక్టర్ అనిల్ కుమార్ గుప్తా, నబిల్ హమ్మద్ పేర్కొన్నారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న టీ హబ్, క్రిటికల్ కేర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా టీ హబ్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అలాగే, నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్‌ను పరిశీలించారు. వారి వెంట ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారులు , ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, ఆర్ఎంఓలు వీరాంజనేయులు, రవికుమార్, విజయ్ సందీప్‌తో పాటు టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

బుక్‌ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంజయ్య



పుస్తకాలను పరిశీలిస్తున్న చైర్మన్

పటాన్‌చెరు టౌన్: బుక్ ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. గురువారం పటాన్‌చెరు గ్రంథాలయానికి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్ డిసెంబర్ 19 నుంచి 29 వరకు నిర్వహిస్తారని అన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అన్ని అందుబాటులో ఉంటాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని గ్రంథాలయాలను జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 20 లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రోజువారీగా న్యూస్ పేపర్లు, నవలలు, విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రాయికోడ్ రూ.50 లక్షలు, నారాయణఖేడ్ ఫస్ట్ ఫ్లోర్ రూ .60 లక్షలు, అందోల్ ఫస్ట్ ఫ్లోర్ రూ .60 లక్షలులతో గ్రంథాలయాలను అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను మోడల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దడం లక్ష్యమన్నారు. అనంతరం గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

నారాయణఖేడ్: విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని నాగల్‌గిద్ద మండల ఎంఈఓ మన్మధకిషోర్ ఆకాంక్షించారు. గురువారం మోర్గి మోడల్ కళాశాలలో సుమారు 560 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఎస్ఆర్ఐ జగదీష్, శ్యాంసుందర్, వేణుగోపాల్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి, అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్యామలాదేవి ఫౌండేషన్ బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సువర్ణ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రమేష్, గిరిధర్, నాగబసవ, శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.